# ఎవరీ కుర్రవాడు

రామారావుకి మనసు మనసులో లేదు. స్టేషన్లో సిమెంట్ బెంచిమీద కూర్చుని పది పన్నెండేళ్ళ కుర్రవాడు ఎవరైనా కొంచెం దూరంలో కనిపిస్తే ఆశగా చూస్తూ, అతను దగ్గిర కాగానే నిరాశతో చూపులు మళ్ళిస్తూ, నిట్టూర్పులు విడుస్తున్నాడు. ఆ వయసున్న కుర్రవాడిని ఎవరిని చూసినా రవిని చూస్తున్నట్టే ఉంది. కాని పరకాయించి చూసి రవి కాడని తెలుసుకోగానే గుండెలో ఏదో బాధ ఊపివేస్తోంది. ఎక్కడున్నాడో రవి ! ఆకలికి ఏమాత్రం తట్టుకోలేడు. ఎలా తింటున్నాడో, ఏం తింటున్నాడో, అసలు తిండి ఉన్నదో లేదో ! ఎక్కడినించి వస్తుంది. ఎవరినైనా అడుక్కోవాలి. లేకపోతే ఏపని చిక్కితే అది చేసి నాలుగు డబ్బులు గడించుకోవాలి. ఎవరిస్తారు పని ? అసలు ఏంపని చెస్తాడు ? తోటపనికూడా ఎరగడే ! వారినీ వీరినీ అడుక్కుంటూ ఉండాలి. రామారావుకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాడిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు ! చిన్నప్పటినించీ ఎంతో గారాబంగా చూసుకున్నాడు. బాగా చదువుకొని పెద్ద డాక్టరో, ఇంజనీరో, ఆఫీసరో అవుతాడని కలలుకంటున్నాడు. అందుకే మంచి క్రమశిక్షణతో పెంచుతూ వచ్చాడు. కాని వాడికి అది గిట్టుబాటు కాలేదు. ఎలా అలవడ్డాయో సావాసాలు. చాటుగా సిగరెట్ తాగటం మొదలుపెట్టాడు. చీటికీ మాటికీ అబద్ధాలు చెప్పటం నేర్చుకొన్నాడు. స్కూలు ఎగగొట్టి ఎక్కడ తిరుగుతాడో, ఎప్పుడు వస్తాడో తెలియదు. ఆ మధ్య ట్యూషన్ చెప్పే టీచర్ "మీవాడు రావటంలేదండీ" అంటే ఆశ్చర్యపోవలసివచ్చింది. చెప్పకుండా సినిమాలకి పోయిరావటం కూడా మొదలైంది. అన్నింటినీ మించి దొంగతనం కూడా చేసాడు. ఆరోజు పదిరూపాయలు జేబులోంచి తీసుకుపోయాడు. ఏంచేశాడో ? ఏమో తనకేం తెలియదంటాడు. కట్టుదిట్టాలు కొంచెం ఎక్కువ చెయ్యక తప్పలేదు. ఒక్కగాను ఒక్క పిల్లవాడు. చక్కగా చదువుకొని ఎంతో పైకి వస్తాడని వాడిమీద ఆశలన్నీ పోగుచేసుకుంటుంటే, పనికిమాలిన సావాసాలతో ఎందుకూ పనికి రాకుండా పోతున్నాడన్న బాధతో ఎంత లాలనగా చెబుతున్నా వాడికి తెలిసిరాలేదు. స్కూలునించి

ప్రోగ్రెస్ రిపోర్ట్ తెచ్చి చూపిస్తే సంతోషపడ్డాడు తను. దారిలో పడ్డాడు ఇంక పరవా లేదనుకొన్నాడు. మంచి మార్కులు వచ్చాయి. తన ఆశలు ఫలిస్తాయనుకున్నాడు. సంతకం పెడుతుంటే గర్వంకూడా కలిగింది. ఆరోజు బజార్లో క్లాస్‌టీచర్ కనిపించి "మీవాడు పరీక్షలకి హాజరవలేదేమండీ ?" అంటే దిమ్మరపోయాడు తను. అవన్నీ దొంగ మార్కులుట. స్కూల్‌కి వెళ్ళి ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే రబ్బరుతో చెరిపేసిన గుర్తులు కనిపించాయి. అవమానంతో తల వాల్చుకోవలసి వచ్చింది. వాడి ఈడుకి ఎంత దగాపని ! కోపం పట్టలేక ఇంటికి రాగానే చెంప చెళ్ళుమనిపించి, "పో బయటికి, పనికిమాలినవాడా"అని చెడామడా తిట్టేశాడు. అంతే! ఎక్కడికి పోయాడో! వారం రోజులయింది. రామారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎన్నో వాకబులు చేశాడు. అక్కడా, ఇక్కడా కనిపించాడని ఎవరెవరో అనటమేగాని ఇంతవరకు జాడ లేదు. ఎక్కడో విజయవాడలో సెంటర్లో కనిపించాడని వార్త వస్తే ఈ ప్రయాణం కట్టాడు. ఎక్కడని వెతుకుతాడు! రామారావు వదనంలో నిస్పృహ వ్యాపించింది. ఇంతలోనే అతనికో భయం కలిగింది. వచ్చినవన్నీ గాలివార్తలే. అసలు వాడు బతికే ఉన్నాడా, ఆకలికి భరించలేక-ఏ అఘాయిత్యమైనా చేశాడా ! ఆలోచించలేక రామారావు దిగులుగా బెంచీకి జేరగిలబడి అందరిముఖాల్లోకి శూన్యంగా చూడసాగాడు.

పది పన్నెండేళ్ళ కుర్రవాడే – కాని వేరుశెనగకాయల బుట్ట చంకన తగిలించుకున్నాడు.

"వేడి వేడి వేరుశనగకాయలు – గిద్దె పావలాండి – ఇయ్యమన్నారా ?"

ఆ కుర్రాడు తనవైపు చూస్తున్న రామారావుని చూసి ఆశగా దగ్గిరకొచ్చి అడిగాడు. ఆ కుర్రవాడి ముఖం వైపు అర్థరహితంగా చూస్తూ "వొద్దు" అన్నాడు రామారావు.

"మంచికాయలండి, బావుంటేనే డబ్బియండి, ఇయ్యమంటారా బాబుగారూ !" ఆ కుర్రవాడు ప్రాధేయపడసాగాడు.

"ఉఁహూం-వద్దంటూంటే" అన్నాడు రామారావు విసుగ్గా.

"కొనండి బాబుగారూ – ఇయాల అసలు బేరం సాగలేదండి. రెండు కిలోల కాయలేసుకొచ్చినా– పావుకిలోకూడ పోలేదు. పుస్తకం కొనాలి బాబుగారూ" అన్నాడు ఆ కుర్రాడు దీనంగా.

"పుస్తకం కొనటమేమిటి?" రామారావుకి అర్థంకాక అడిగాడు.

"నేను ఏడో తరగతి చదువుతున్నానండి – పుస్తకాలు లేకపోతే బళ్లోకి రానియ్యరండి. ఇయన్నీ అమ్మితే మూడు రూపాయలొస్తయ్యండి. ఒకరూపాయి ఇంట్లో ఇస్తే, రెండ్రూపాయలుంటాయండి. ఒక పుస్తకం వొస్తుందండి" గబ గబ విషయం చెప్పాడు ఆ కుర్రవాడు.

"చదువుతున్నావా, మరి పుస్తకం మీనాన్న కొనిపెట్టడూ ?"

రామారావు ప్రశ్నకి ఆ కుర్రవాడు మౌనంగా కింది చూపులు చూస్తూ తల అడ్డంగా తిప్పాడు.

"ఎందువల్ల ? డబ్బు లేదా ? అసలు మీనాన్న ఏంచేస్తుంటాడు ?"

ఆ కుర్రాడు అలాగే కిందిచూపులు చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"నీ పేరేమిటి ?"

"మీరా."

"మీనాన్న ఏం చేస్తుంటాడు ? ఎందుకు డబ్బివ్వడు?" మళ్ళీ అడిగాడు రామారావు.

"డప్పు వేస్తాడండి. ఎప్పుడూ తాగొచ్చి మా అమ్మని కొడతాడండి. డబ్బు లేవైనా ఉంటే గుంజుకుపోతాడండి. పక్క ఊరునించి రోజూ సాయంకాలం కాయలు తెచ్చి అమ్మి డబ్బు దాచుకొని చదువుకోటానికి పుస్తకాలు కొంటానండి. ఇయాల సెలవురోజు కనుక పొద్దునే వచ్చానండి" అన్నాడు మీరా.

రామారావుకి జాలివేసింది. అతనికి తటాలున ఒక ఆలోచన కలిగింది.

"ఇదిగో మీరా, నువ్వు ఎవరైనా కుర్రవాడు ఇటురావటం చూశావా? నీ అంత ఎత్తుంటాడు ఎర్రగా, బక్కపలచగా-"

"ఆఁ-ఆఁ-చూశానండి-"

రామారావుని ఒక్కసారిగా ఉత్సాహం, సంతోషం, ఆశ పెనవేసుకున్నాయి.

"ఆ అబ్బాయి ఎక్కడున్నాడో తెలుసా ?"

"తెలీదండి. చెప్పకుండా ఇంట్లోంచి పారిపోయి వచ్చాడంటండి. ఆకలిగా ఉందంటే కాసిని కాయలిచ్చి అమ్ముకోమన్నానండి. అమ్మేసి రూపాయి లాభం చేసుకున్నాడండి– మర్నాడు ఎటుపోయినాడో కనపడలేదండీ. ఆ అబ్బాయి మీ తాలూకా?"

రామారావు రెప్పవేయకుండా మీరావైపు చూడసాగాడు. అతని ముఖంలో రవి కనిపించసాగాడు.

"పేరేంటంటే రవనో ఏంటో అన్నాడండి."

"మీరా !" అన్నాడు రామారావు భావావేశంతో. "వాడే– మారవే. వేరుశనగ కాయ లమ్ముకొన్నాడా ! నువ్వెంతో మంచివాడివి మీరా—వాడికెంతో సాయం చేశావు. నిన్ను చూస్తుంటే వాడినే చూస్తున్నట్టుంది. ఇదిగో, పది రూపాయలతో పుస్తకాలు కొనుక్కో,చూడూ—ఇది నాఅడ్రసు కార్డు-నీకెప్పుడన్నా అవసరముంటే నాదగ్గిరికి రా."

తెల్లబోతున్న మీరా చేతిలో పది రూపాయిలూ, తన అడ్రసు కార్డూ పెట్టి అప్పుడే రైలు రావటంతో ఆదరాబాదరాగా వెళ్ళి రైలులో కూర్చొన్నాడు రామారావు.

విజయవాడలో దిగి మెయిన్‌రోడ్డు మీద నడిచే జనంలో పది పన్నెండేళ్ల కుర్రవాళ్ళందర్నీ పరీక్షగా చూస్తూ నడుస్తున్నాడు రామారావు.

"బూట్‌పాలిష్ బాబూ" రామారావు వినిపించుకోలేదు.

ఎవరో కుర్రాడు ఆశగా పేవ్‌మెంట్‌మీద నుంచి పరిగెత్తుకుంటూ వచ్చాడు. రామారావు ఆశగా చూశాడు-ఎవరో బూట్‌పాలిష్ కుర్రాడు.

"ప్లీజ్-సార్-ప్లీజ్-బూట్‌పాలిష్ సార్."

రామారావు కొంచెం వింతగా చూశాడు ఆ కుర్రాడివైపు. పది పన్నెండేళ్లు ఉంటాయి. కళ్లలో ఏదో దైన్యం ఉంది. రవిలా సన్నగా కొంచెం ఎర్రగా ఉన్నాడు. రవి కళ్ళలో మెదిలాడు.

"వొద్దు" అని నడక సాగించాడు రామారావు. కాని అతను వెంటబడ్డాడు.

"సార్-ప్లీజ్—ఆకలిగా ఉందండీ, పావలాకే పాలిష్ చేస్తానండి—ఒక్కపావలా సార్" రామారావు కసురుకున్నాడు.

"సార్-ఇయాల ఒక్కపావలా కూడా సంపాయించ లేదండి. పొద్దుటి నించీ ఏం తినలేదండి. ఆకలిగా ఉంది సార్-"

"ఇంట్లో తినలేదా ?" అడిగాడు రామారావు.

"నాకెవరూ లేరండి."

రామారావు అతనివైపు దీక్షగా చూశాడు.

"ఇంట్లోంచి పారిపోయి వచ్చావా ?"

అతను మాట్లాడక మౌనంగా తల దించుకొన్నాడు.

"ఏం ?" రెట్టించాడు రామారావు.

"అవును సార్, మా నాన్న లేడండి. మాది చాలా పేద కుటుంబమండి - హోటల్‌లో కప్పులు కడిగే పనిలో పెట్టాడండి మా అన్నయ్య. ఓ సారి కప్పులున్న ట్రే కిందపడి కప్పులు పగిలిపోయాయండి. హోటల్ యజమాని పనిలోంచి తీసేశాడండి. ఆ మాట చెబితే మా అన్నయ్య నన్ను గొడ్డుని బాదినట్టు బాదాడండి. 'తిండి పోతు సోమరి గాడిదా' అని తిట్టి ఇంట్లోంచి గెంటేశేడండి. సంవత్సరమైందండి. మొదట్లో అడుక్కుని తిన్నానండి. ఒక బూట్‌పాలిష్ చేసే అతను కొన్నాళ్ళు జబ్బు చేసి ఆ సరంజామా నాకిచ్చి పాలిష్ చేసుకో మన్నాడండి. అప్పట్నించీ ఇందులోనే ఉన్నానండి. ప్లీజ్-సార్-ఒక్క పావలా-"

రామారావుకి జాలివేసింది. పాలిష్ వెయ్యమని కాలికి తొడుక్కున్న హాఫ్ బూట్లు తీసి ఇచ్చాడు. కుర్రవాడు పాలిష్ పనిలో నిమగ్నుడైనాడు. చదువుకోవలసిన వయసు.

"నువ్వేం చదువుకోలేదా ? అన్నట్టు నీ పేరేమిటి ?"

"నారాయణ సార్. మా నాన్న పోగానే బడి మానేశానండి. పెద్ద పెద్దోళ్ళని చూస్తుంటే చదువుకోవాలనిపిస్తుందండి. పుస్తకం కొనుక్కొని రాత్రిళ్ళు ఈ పేవ్‌మెంట్ మీద లైటు కింద చదువు కుంటానండి.నేను బూట్‌పాలిష్‌చేస్తూనే. ఆ మాస్టరు గారు ఒకాయనగారి దగ్గిరికి అప్పుడప్పుడు వెళ్ళి చెప్పించు కుంటానండి" అన్నాడు ఆ కుర్రవాడు.

రామారావుకి జాలివేసింది.

"ఈ పాలిష్ సరంజామా బాక్స్ ఒకటి కొనుక్కోక పోయావా ? కొంచెం పెద్ద ఎత్తున చేస్తే మిగుల్చుకుని చదువుకోవచ్చు గదా."

"కొనాలనే ఉంది సార్ — సగం రేటుకి ఒకాయన ఇస్తానన్నాడు. డబ్బు కావాలి — ఆకలే తీరటంలేదు. ఎక్కడనించి వస్తుంది ?" అన్నాడు ఆ కుర్రవాడు.

రామారావుకి అకస్మాత్తుగా ఆలోచన కలిగింది.

"చూడు నారాయణా, ఈ మధ్య ఓ కుర్రవాడు — నీలాగే సన్నగా ఉంటాడు- ఇంతే ఎత్తు — కొంచెం ఎర్రగా ఉంటాడు — ఇక్కడ ఎక్కడైనా కనిపించాడా ?"

ఆ కుర్రవాడు చప్పున తలెత్తి రామారావు వంక చూశాడు.

"కనిపించకేం — ఏవరో, రవో, ఏదో, అంట పేరు — మీ తాలూకే నేంటి బాబూ?" అన్నాడు.

రామారావు ఎంతో ఆశగా "ఆఁ- ఆఁ- మా వాడే, రవి — కనిపించాడా ? ఎక్కడున్నాడు ?" అన్నాడు.

"ఏమో సార్ — అయిదారు రోజు లయిందేమో — ఆకలితో ఇక్కడే సొమ్మ సిల్లి పడిపోతే — కాఫీ కొనిచ్చా బాబు — రెండ్రోజులు నాతోపాటే పాలిష్‌వేసి ఎట్లాగో కడుపు నింపుకున్నాడు. గిట్టుబాటుకాక వొదిలేసిపోయినాడు." రామారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బూట్‌పాలిష్ చేశాడా రవి, ఆకలితో అలమటించి పోయాడా ! ఈ కుర్రవాడు ఆదుకున్నాడా ! దీక్షగా బూట్‌పాలిష్ కుర్రవాడి ముఖంలోకి చూస్తున్న రామారావుకి అతని ముఖంలో రవి ముఖమే చిందులాడింది.

"పాలిష్ అయింది బాబూ — ఇదిగో—"

బూట్లు చప్పున వేసుకుని "ఇదిగో నారాయణా, పాలిష్ సరంజామా బాక్సు కొనుక్కో — చూడూ నీకు ఏదైనా అత్యవసరం కలిగితే, ఇదిగో ఈ అడ్రసుకు కార్డు రాయి — ఏదైనా సాయం చేస్తాను."

ఆశ్చర్యపోతున్న ఆ కుర్రవాడి చేతిలో ఓ పదిరూపాయలనోటూ, అడ్రసు కార్డు పెట్టి బస్‌వెనక నడిచిపోయాడు రామారావు.

"పత్రికలు సార్-పత్రికలు-అన్ని పత్రికలూ ఉన్నాయి సార్-చూడండిసార్."

పది పన్నెండేళ్ళ కుర్రాడే. రవి కాడు. ఎవరో పేపర్లు అమ్ముకునే కుర్రాడు. కొంటారా కొంటారా సార్ ?" అతను ఆశగా రామారావువైపు చూశాడు.

"చూడూ, నీ పేరేమిటి ?"

"రాముడండి, ఎందుకు?"

"ఏంలేదు,చూడు రాముడూ, ఈ పత్రికలు అమ్మేసి, పదింటికి బడికిపోతావా?"

"బడా-ఎప్పుడో మానేశాను. బడికిపోతే ఎట్లా గడుస్తది—కొంటారా సార్ ?"

రామారావు జాలిగా చూశాడు అతనివైపు. ఇంకేమీ అడగవలుచుకోలేదు.

"రాముడూ—ఈ మధ్య ఓ పది పన్నెండేళ్ళ కుర్రాడు — నీలాగే - సన్నగా - కొంచెం ఎత్తుగా - కొంచెం ఎర్రగా ఉంటాడు-"

"పది పన్నెండేళ్ళ కుర్రాళ్ళందరూ అలాగే ఉంటారుకదా సార్ — పారిపోయి వచ్చాడా? హోటళ్లదగ్గిరా, సెంటర్లలో, బస్‌స్టాండ్‌లో, స్టేషన్లో చూడండి సార్-అడుక్కుంటూనో, ఏదైనా అమ్ముకుంటూనో కనపడొచ్చు" అన్నాడతను.

రామారావు అతని దగ్గిర ఖరీదైన అరడజను పత్రికలు కొన్నాడు. కాళ్ళరిగి పోయేట్టు తిరిగాడు. ఉస్సురంటూ బస్‌స్టాండ్‌కి వచ్చాడు, రాత్రయింది. కాళ్లలో సత్తువ లేక అక్కడ ఉన్న బెంచిమీద కూలబడిపోయాడు.

"పత్రిక సార్—పత్రిక—కావాలండీ."

దూరంనించి ఎవరో కుర్రాడు అరుస్తూ వస్తున్నాడు. దగ్గిర్లో ట్యూబ్‌లైట్ లేనందువల్ల మసక వెలుతురుగా ఉంది. రవిలాగే పది పన్నెండేళ్ల కుర్రాడు. అదే బక్కపలచ విగ్రహం. ఆశగా చూడసాగాడు రామారావు. రవేనా ? అతనికి రాముడి మాటలు చప్పున గుర్తుకొచ్చాయి. పది పన్నెండేళ్ల కుర్రాళ్ళు అలాగే ఉంటారు. అవును.

"పేపర్ సార్"

కుర్రాడు దగ్గిరగా వస్తున్నాడు ఎవరు ? మాసిపోయి, నలిగిపోయిన దుస్తులతో రేగిన జుట్టుతో, నల్లబడి పీక్కుపోయిన ముఖంతో-ఎవరీ కుర్రాడు ? రవి, రవేనా ?

"పేపర్ కావాలండీ ?" అరుస్తూ వస్తున్నాడు అతను.

రామారావుకి ఏదో వెర్రి ఆవేశం కలిగింది.

"కావాలి. అన్ని పేపర్లూ కావాలి" గట్టిగా అరిచాడు రామారావు. ఆ కుర్రాడు చప్పున తలెత్తి రామారావువైపు చూశాడు. అతని చేతిలో పేపర్లకట్ట జారిపడింది. అతని ముఖం స్పష్టంగా చూడటానికి రామారావుకి కన్నీటితెర అడ్డువస్తోంది. నిజంగా తన రవేనా వేరుశనగికాయలు అమ్మే మీరానా ? బూట్ పాలిష్ చేసే నారాయణా ? పేపర్ అమ్ముకునే రాముడా ? ఏమిటిది ? ఇతని ముఖంలో వీళ్ళందరి ముఖాలూ దోబూచులాడుతున్నాయేం ? ఎవరీ కుర్రాడు ? రవీ, రవీ నువా, కాదా ! నువ్వేనా ! రామారావుకి మాట పెగల్లేదు. అతని గొంతు పూడుకుపోయింది. కన్నీరు ధారాపాతంగా కారుతోంది. ఎవరు, ఏవరీ పది పన్నెండేళ్ల కుర్రాడు !

[ఆకాశవాణి, విజయవాడనుండి ప్రసారితం]